నమస్తే తెలంగాణ
ఖమ్మం
12 | ఖమ్మం, మంగళవారం 4 మార్చి 2025 | KHAMMAM

ఖమ్మంలోని అమరవీరుల స్తూపం వద్ద పోస్టుకార్డులు చూపిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

'ఉద్యమకారుల' పోస్టుకార్డు ఉద్యమం

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్

ఖమ్మం, మార్చి 3: ఎన్నికలకు ముందు ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని మయూరి సెంటర్‌లో గల అమరవీరుల స్తూపం వద్ద సోమవారం పోస్టు కార్డు ఉద్యమం చేపట్టారు. పోస్టుకార్డులపై సంతకాలు చేసి సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల స్థలం, రూ.25 వేల పెన్షన్, గృహ నిర్మాణం కోసం రూ.10 లక్షల నగదు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఉద్యమకారుల కోసం మ్యానిఫెస్టోలో పొందుపరిచిన విధంగా అమలు చేయాలని కోరారు. ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ పసుపులేటి నర్సయ్య, ఉద్యమకారులు గుంతేటి వీరభద్రం, పెళ్లూరి విజయ్‌కుమార్, రవిచంద్ర చౌహాన్, షేక్ నాగుల్ మీరా, షేక్ అబ్బాస్ అలీ, బురాన్, ఆసిఫ్, శ్రీనివాస్‌నాయక్, బాలిని భాస్కరరెడ్డి, దేవిరెడ్డి విజయ్, భట్టు రాజేందర్‌నాయక్, బెల్లంకొండ నాగేశ్వరరావు, రెడ్డెబోయిన వరలక్ష్మి, కొరివి ధనలక్ష్మి, కామని అనంతలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

ఆస్పత్రుల ప్రగతిపై సమీక్షలో భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్

మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో విధులు నిర్వర్తించే వైద్యులు, సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వైద్య విధాన పరిషత్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలోని ఆస్పత్రుల ప్రగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్, స్కానింగ్, రక్త పరీక్షలు, సర్జరీలు, డయాలసిస్, డెలివరీలపై ఆస్పత్రుల వారీగా ప్రగతిపై నివేదికలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రుల్లో పారిశుధ్య నిర్వహణ కోసం అధునాతన యంత్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈఎన్‌టీ వైద్యం కోసం కావాల్సిన యంత్ర పరికరాలకు సంబంధించి నివేదికలు అందించాలని, గత ఏడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వర్షాకాలంలో ఆస్పత్రుల్లో ఎక్కడైనా లీకేజీ, తాగునీటి సమస్య ఉంటే వాటిని గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సిబ్బంది హాజరుపై ఆకస్మిక తనిఖీలు చేపడతామన్నారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద రోగులకు అందించే వైద్య సేవల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగా అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ రవిబాబు, జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల బై బ్యాక్ వద్దు

ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిలో సీపీఎం నాయకులు

కలెక్టరేట్‌లోకి వెళ్తున్న నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

రఘునాథపాలెం, మార్చి 3: రఘునాథపాలెం మండలం శివాయిగూడెం కొత్త కాలనీ (పువ్వాడ ఉదయ్‌నగర్)లో 900 మంది పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల బై బ్యాక్‌కు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ధర్నాచౌక్ నుంచి ప్రదర్శనగా కలెక్టరేట్ వద్దకు బాధితులతో వెళ్లిన సీపీఎం నేతల బృందం కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతకు దారితీసింది. కొద్దిసేపు తోపులాట జరిగింది. తమ ఇళ్ల స్థలాలు గుంజుకోవద్దని బాధితులు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. శివాయిగూడెం కొత్త కాలనీ (పువ్వాడ ఉదయ్‌నగర్)లో పేదల ఇళ్ల స్థలాల బై బ్యాక్ ప్రక్రియను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజాగ్రహానికి గురవుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోగా.. ఇచ్చిన స్థలాలను గుంజుకునే ప్రయత్నం చేయడం సరికాదని అన్నారు. ఆ పార్టీ నాయకులు ఎర్రా శ్రీకాంత్, వై.విక్రం తదితరులు పాల్గొన్నారు.

సహచర ఎంపీలకు 'వద్దిరాజు' సత్కారం

రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర తన సహచర ఎంపీలు బీద మస్తాన్‌రావు, సుభాశిష్ కుంతియాలను సోమవారం సత్కరించారు. ఎంపీ రవిచంద్రకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మస్తాన్ రావు, ఒడిషాకు చెందిన కుంతియా రాజ్యసభలో సహచర సభ్యులు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించారు.

-ఖమ్మం, మార్చి 3



- ఖమ్మంలో విపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా
- ఆందోళనలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు
- కలెక్టరేట్‌ను ముట్టడించిన పార్టీల శ్రేణులు
- ఖమ్మంలో మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్
- క్వింటా రూ.25 వేల చొప్పున కొనుగోలు చేయాలని పట్టు
- మిర్చి రైతుల ఆత్మహత్యలపై ముగ్గురు మంత్రులు స్పందించాలని అల్టిమేటం

ధర్నా వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు, టీఎస్ సీడ్స్ మాజీ చైర్మన్ కొండబాల, సీపీఐ, సీపీఎం నేతలు బాగం, పోతినేని

మిర్చి రైతుల గోడు పట్టదా?

రఘునాథపాలెం, మార్చి 3: ఖమ్మం జిల్లాలో మిర్చి రైతులకు విపక్ష పార్టీలు బాసటగా నిలిచాయి. మార్కెట్‌లో దగాకు గురవుతున్న అన్నదాతలకు అండగా నిలిచేందుకు విపక్షాలన్నీ ఒక్కటయ్యాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచైనా సరే మిర్చి రైతులకు న్యాయం చేయాలనే సంకల్పంతో ముందుకొచ్చాయి. సోమవారం విపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ఉన్న ధర్నాచౌక్‌లో పెద్దఎత్తున ఆందోళన జరిగింది. అందులో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, మాస్‌లైన్ పార్టీల నేతలు పాల్గొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని గళం విప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో ప్రధాన పంటల్లో మిర్చి ఒకటని, ఈ ఏడాది అనుకూల వాతావరణ పరిస్థితులు, ఇతరత్రా కారణాలతో పెట్టుబడులు గణనీయంగా పెరిగిపోయాయని అన్నారు. నిరుడు ఇదే సీజన్‌లో క్వింటా మిర్చి ధర రూ.23 వేలు ఉంటే ఇప్పుడు కేవలం రూ.12 వేల నుంచి రూ.13 వేల మధ్య మాత్రమే వెచ్చించి కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. క్వింటా మిర్చి రూ.25 వేల చొప్పున కొనుగోలు చేసేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ద్వారా మిర్చిని కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నేతలు లింగాల కమల్‌రాజు, సండ్ర వెంకట వీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, బానోతు చంద్రావతి, బొమ్మెర రామ్మూర్తి, పగడాల నాగరాజు, అజ్మీరా వీరూనాయక్, తేజావత్ రామోజీ, సీపీఎం నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, అడపా రామకోటయ్య, బొంతు రాంబాబు, మాదినేని రమేశ్, ఆవుల వెంకటేశ్వర్లు, పుచ్చకాయల సుధాకర్, బాగం ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల ఇళ్లు, కార్యాలయాలు ముట్టడిస్తాం..

కలెక్టరేట్‌లోకి చొచ్చుకొని వెళ్తున్న చంద్రావతి, మహిళా నేతలు

ధరల స్థిరీకరణ కోసం ఖమ్మంలో మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో మిర్చిసాగు చేసిన రైతులు నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇంతమంది రైతులు చనిపోతున్నా మిర్చి ధరలపై కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంతో ఎందుకు మాట్లాడటం లేదో చెప్పాలి. వైరా మాజీ ఎమ్మెల్యే చంద్రావతి మాట్లాడుతూ.. గిట్టుబాటు ధర కల్పించి మిర్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ.. వాణిజ్య పంటగా చూస్తున్న మిర్చిని ఆహారపంటల జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటాలను నిర్లక్ష్యం చేస్తే మంత్రుల క్యాంపు కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే నలుగురు మిర్చి రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే మిర్చి రైతులతో కలిసి మంత్రుల ఇళ్లు, కార్యాలయాలను ముట్టడిస్తామని స్పష్టం చేశారు.

విజయ సంకేతం చూపిస్తున్న శ్రీపాల్‌రెడ్డి

అంతిమ గెలుపు ఉపాధ్యాయులదే: పింగిళి శ్రీపాల్‌రెడ్డి

నల్లగొండ, మార్చి 3: వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంతిమంగా ఉపాధ్యాయులు గెలిచారని పీఆర్టీయూ అభ్యర్థి, విజేత పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. కౌంటింగ్ అనంతరం ఆయన మీడియా సెంటర్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈరోజు ఉపాధ్యాయులు ఇచ్చిన తీర్పు అత్యంత విలువైనదని, వారి ఆత్మగౌరవమే వారిని విజయం దిశగా నడిపించిందని అన్నారు. తనపై బాధ్యత ఉంచి.. ఉపాధ్యాయులు తమ అమూల్యమైన ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించినందుకు రానున్న రోజుల్లో పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు పటిష్టంగా అభివృద్ధిపరిచే విధంగా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

వరంగల్ - ఖమ్మం - నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి గెలుపు

- ఘన విజయం సాధించిన 'పింగిళి'
- ఆది నుంచీ స్పష్టమైన ఆధిక్యత
- తొలి ప్రాధాన్యంలో 2,148 ఓట్లతో ముందంజ
- రెండో స్థానంలో యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి
- నల్లగొండలో 14 గంటలపాటు సాగిన కౌంటింగ్

టీచర్స్ ఎమ్మెల్సీగా శ్రీపాల్

నల్లగొండ ప్రతినిధి, మార్చి 3 (నమస్తే తెలంగాణ): వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికల్లో పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం సాధించారు. ఆది నుంచీ స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శిస్తూ తొలి ప్రాధాన్య ఓట్ల సాధనలో అగ్రస్థానంలో నిలిచారు. తొలి ప్రాధాన్య ఓట్లల్లోనే 2,148 ఓట్ల ఆధిక్యతను ప్రదర్శిస్తూ ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ ఎక్కడా తగ్గలేదు. మొత్తం 19 మంది అభ్యర్థుల్లో 17 మంది అభ్యర్థుల ఎలిమినేషన్ వరకు శ్రీపాల్‌రెడ్డినే మెజార్టీ ఓట్లను సాధిస్తూ వచ్చారు. ఎలిమినేషన్ రౌండ్స్ పూర్తయ్యే సరికి అత్యధిక ఓట్లు సాధించిన అభ్యర్థిగా శ్రీపాల్‌రెడ్డి విజేతగా నిలిచారు. రెండో స్థానం కోసం యూటీఎఫ్ బలపర్చిన సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న పీసీసీ అధికార ప్రతినిధి గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిల మధ్య 'నువ్వానేనా?' అన్నట్లుగా చివరి వరకు పోరు కొనసాగింది. ఉదయం 8 గంటలకు మొదలైన కౌంటింగ్ ప్రక్రియ రాత్రి 10:30 గంటల వరకు కొనసాగింది. ఉదయం 11 గంటల నుంచి తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు వివరాలను అభ్యర్థుల వారీగా రిటర్నింగ్ అధికారి ఇలా త్రిపాఠి ప్రకటించారు.

2,148 ఓట్ల ఆధిక్యం..

తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ముగిసే సరికి పీఆర్‌టీయూ అభ్యర్థి పింగిళి శ్రీపాల్‌రెడ్డి స్పష్టమైన ఆధిక్యతను ప్రదర్శించారు. 2,148 ఓట్ల ఆధిక్యతతో ముందంజలో నిలిచారు. మొత్తం 24,135 తొలి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో 494 ఓట్లు చెల్లనివిగా తేల్చారు. మిగిలిన ఓట్లల్లో వరుసగా శ్రీపాల్‌రెడ్డికి 6,035, యూటీఎఫ్ నర్సిరెడ్డికి 4,820, హర్షవర్ధన్‌రెడ్డికి 4,437, పూల రవీందర్‌కు 3,115, సర్వోత్తంరెడ్డికి 2,289, సుందర్‌రాజుకు 2,040, కొలిపాక వెంకటస్వామికి 421 ఓట్లు వచ్చాయి. మిగతా వారికి డబుల్ డిజిట్ దాటలేదు. చిలుక చంద్రశేఖర్‌కు ఒక్క ఓటు పోల్ కావడం గమనార్హం.

గెలుపు కోటాగా 11,821 ఓట్లు

తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ముగిశాక చెల్లని ఓట్లను పక్కనపెట్టి చెల్లిన ఓట్ల నుంచి గెలుపు కోటాను ఖరారు చేశారు. మొత్తం చెల్లిన ఓట్లు 23,641 ఓట్లు కాగా.. అందులో 50 శాతం ప్లస్ ఒకటి కలిపి గెలుపు కోటా ఓట్లను నిర్ధారణ చేశారు. 11,821 ఓట్లను గెలుపు కోటాగా నిర్ధారణ చేయగా.. ఏ అభ్యర్థి కూడా తొలి ప్రాధాన్య ఓట్లల్లో గెలుపు కోటాకు దరిదాపుల్లోనూ లేరు. అత్యధిక ఓట్లు సాధించిన శ్రీపాల్‌రెడ్డి సైతం 5,786 ఓట్ల దూరంలో నిలిచారు. దీంతో ఎలిమినేషన్ రౌండ్స్‌లో అతి తక్కువ తొలి ప్రాధాన్య ఓట్లను సాధించిన అభ్యర్థులను కింద నుంచి పైకి ఎలిమినేట్ చేస్తూ ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపును ప్రారంభించారు. ఇది సాయంత్రం 4 గంటల నుంచి మొదలైంది.

నల్లగొండలో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తున్న ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ సిబ్బంది

పూల రవీందర్ ఎలిమినేషన్‌లో భారీగా ఓట్లు

పూల రవీందర్ (3,992 ఓట్లు) ఎలిమినేషన్ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి అత్యధికంగా 1,348 ఓట్లు రాగా.. తర్వాత నర్సిరెడ్డికి 788 ఓట్లు, హర్షవర్ధన్‌రెడ్డికి 725 ఓట్లు కలిసొచ్చాయి. దీంతో ఈ రౌండ్ ముగిసే సరికి మొత్తం శ్రీపాల్‌రెడ్డికి 9,021 ఓట్లు, నర్సిరెడ్డికి 6,448 ఓట్లు, హర్షవర్ధన్‌రెడ్డికి 6,034 ఓట్లు వచ్చాయి. అయితే హర్షవర్ధన్‌రెడ్డి ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు.

శ్రీపాల్‌రెడ్డికి 13,969 ఓట్లు

పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి మొత్తం 13,969 ఓట్లు సాధించారు. గెలుపు కోటా 11,821 ఓట్లు కాగా.. అంతకుమించి 2,148 ఓట్లతో భారీ విజయం సాధించారు. రెండో స్థానంలో ఉన్న యూటీఎఫ్ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి ఎలిమినేషన్ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డి గెలుపు కోటాను అధిగమించి ముందుకువెళ్లారు. ఈ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డి 2,870 ఓట్లు సాధించి విజయం ఖరారు చేసుకున్నారు. అంతకుముందు హర్షవర్ధన్‌రెడ్డి ఎలిమినేషన్ రౌండ్‌లో శ్రీపాల్‌రెడ్డికి 2,078 ఓట్లు రాగా.. నర్సిరెడ్డికి 2,000 ఓట్లు పోల్ అయ్యాయి. ఇక్కడే శ్రీపాల్‌రెడ్డి గెలుపు కోటాకు మరో 722 ఓట్ల దూరంలో నిలిచారు. దాంతో రెండో స్థానంలో ఉన్న నర్సిరెడ్డిని కూడా ఎలిమినేట్ చేస్తూ లెక్కింపు కొనసాగించారు. చివరకు గెలుపు కోటాను మించి ఓట్లు సాధించి శ్రీపాల్‌రెడ్డి ఘన విజయం సాధించారు. దాంతో ఎన్నికల కమిషన్ నిర్ణయం మేరకు పీఆర్టీయూటీఎస్ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి గెలుపును ధ్రువీకరిస్తూ రిటర్నింగ్ ఆఫీసర్ ఇలా త్రిపాఠి ఆయనకు ధ్రువీకరణ పత్రం అందజేశారు.

రెండో ఓటు వేయని టీచర్లు 9,672 మంది

ఈ ఎన్నికల్లో రెండో ప్రాధాన్యత ఓటు వేయని వారూ సైతం పెద్ద సంఖ్యలో ఉన్నారు. ఎలిమినేషన్ రౌండ్స్ లో లెక్కింపు పూర్తయ్యే సరికి మొత్తం 9,672 మంది బ్యాలెట్‌లో కేవలం తొలి ప్రాధాన్యత ఓట్లు మాత్రమే వేసి తర్వాత ఎవరికీ వేరే ప్రాధాన్యత ఓట్లు ఇవ్వలేదు.

ఎలిమినేషన్ రౌండ్స్‌లోనూ శ్రీపాల్‌రెడ్డి ఆధిక్యత

కాగా, మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉండగా.. వారిలో 17 మంది ఎలిమినేషన్ రౌండ్ల వారీగా కొనసాగింది. డబుల్ డిజిట్ ఓట్లు సాధించిన అభ్యర్థులతోపాటు త్రిబుల్ డిజిట్ సాధించిన ఒక్క అభ్యర్థి సైతం 13 రౌండ్స్‌లో ఎలిమినేట్ అయ్యారు. అప్పటికీ అదనంగా శ్రీపాల్‌రెడ్డికి 130, నర్సిరెడ్డికి 126, హర్షవర్ధన్‌రెడ్డికి 159, పూల రవీందర్‌కు 130, సర్వోత్తంరెడ్డికి 105, సుందర్‌రాజుకు 101 ఓట్లు మాత్రమే ద్వితీయ ప్రాధాన్య ఓట్లు పోలయ్యాయి. అయితే సుందర్‌రాజు (2,141 ఓట్లు) ఎలిమినేషన్ రౌండ్‌లో మాత్రం అత్యధికంగా శ్రీపాల్‌రెడ్డికి 751, పూల రవీందర్‌కు 368, నర్సిరెడ్డికి 259, సర్వోత్తంరెడ్డికి 251, హర్షవర్ధన్‌రెడ్డికి 203 ఓట్లు పోలయ్యాయి. తర్వాత బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తంరెడ్డి (2,645 ఓట్లు)ని కూడా ఎలిమినేట్ చేస్తూ ఆయన దాంట్లో పోలైన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను మిగతా అభ్యర్థులకు పంచారు. ఇందులోనూ శ్రీపాల్‌రెడ్డికి అత్యధికంగా 757 ఓట్లు, తర్వాత హర్షవర్ధన్‌రెడ్డికి 510 ఓట్లు, యూటీఎఫ్ నర్సిరెడ్డికి 455 ఓట్లు, పూల రవీందర్‌కు 375 ఓట్లు జత కలిశాయి. అయినప్పటికీ ఎవరు కూడా గెలుపు కోటాకు దరిదాపుల్లోకి రాలేకపోయారు.

494 చెల్లని ఓట్లు వేసిన గురువులు..

సమాజానికి మార్గనిర్దేశం చేసే ఉపాధ్యాయులు.. వారు వేసిన ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ చెల్లని ఓట్లు ఉండడం గమనార్హం. చెల్లని ఓట్లు 494 ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇవి మొత్తం ఓట్లల్లో 2.04 శాతం కావడం గమనార్హం. 2019 ఎన్నికల్లోనూ 18,884 ఓట్లు పోలైతే.. అందులో 858 ఓట్లు చెల్లనివిగా నిర్ధారణ అయిన విషయం విదితమే.

విద్య ప్రైవేటీకరణ కాకుండా పోరాడుతా.. మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

నల్లగొండ, మార్చి 3: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడినా ప్రభుత్వ విద్య ప్రైవేటీకరణ కాకుండా పోరాటం చేస్తానని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. హర్షవర్ధన్ రెడ్డి ఎలిమినేషన్ తర్వాత నర్సిరెడ్డి కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లి మీడియాతో మాట్లాడారు. ఓటమి అనేది సహజమని అన్నారు. గతంలో తన ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన ఉపాధ్యాయులు ఇప్పుడు శ్రీపాల్‌రెడ్డికి ఇచ్చారని అన్నారు. మరోసారి తనకు ఓట్లు వేసిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని అన్నారు. శ్రీపాల్‌రెడ్డి గెలుపును స్వాగతిస్తున్నట్లు చెప్పారు.

ఇంటర్ ఇన్విజిలేషన్ విధులకు నేడు ఉత్తర్వులు

- ఎగ్జామ్ సెంటర్లలో ఏర్పాట్లు పరిశీలించిన సీఎస్, డీవోలు
- పరీక్ష నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు
- ఖమ్మంలో మొత్తం 892 మంది ఇన్విజిలేటర్లు అవసరం
- ఇంటర్ విద్యాశాఖ నుంచి 322 మంది అందుబాటులోకి..
- పాఠశాల విద్య నుంచి 570 మందికి డిప్యూటేషన్ విధులు

ఖమ్మం అర్బన్, మార్చి 3: ఇంటర్మీడియట్ పరీక్షలకు సంబంధించి మంగళవారం ఉదయం నుంచి ఇన్విజిలేటర్లకు డ్యూటీల కేటాయింపు ఉత్తర్వులు ఇవ్వనున్నారు. బుధవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఉత్తర్వులు అందుకున్న వారితో ఆయా కేంద్రాల సీఎస్, డీవోలు సమావేశం నిర్వహించి పరీక్ష నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించనున్నారు. పరీక్షల నిర్వహణకు మొత్తం 892 మంది ఇన్విజిలేటర్లు కావాల్సి ఉండగా.. 322 మంది ఇంటర్ పరిధిలో అందుబాటులో ఉన్నారు. మిగతా 570 మందిని స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి కేటాయించాలని ఇంటర్ విద్యాశాఖాధికారులు కోరారు. దీంతో డీఈవో సోమశేఖర శర్మ పాఠశాలలకు ఎలాంటి ఆటంకం లేకుండా అదనంగా ఉన్న టీచర్ల వివరాలను అందజేయాలని ఎంఈవోలకు సూచించారు. అత్యధికంగా ఖమ్మం అర్బన్ మండలంలోని పరీక్ష కేంద్రాలు ఉండడం.. ఇన్విజిలేషన్ చేయాల్సింది కూడా ఖమ్మంలోనే కావడంతో ఇతర ప్రాంతాల వారు సుముఖత చూపించడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో అవసరమైన ఇన్విజిలేటర్లు దొరకని పరిస్థితి ఏర్పడింది. అర్బన్ ఎంఈవో శైలజాలక్ష్మి.. డీఈవో, డీఐఈవోలను సమన్వయం చేసుకుంటూ ఉపాధ్యాయులను గుర్తించి ఇన్విజిలేషన్ విధులు కేటాయిస్తున్నారు. ఇతర మండలాల ఎంఈవోల నుంచి వివరాలు తెప్పించి అవసరమైన కేంద్రాలకు డ్యూటీలు వేస్తున్నా.. ఇంకా ఇన్విజిలేటర్ల కొరత ఉంది. 570 మందికి సోమవారం సాయంత్రానికి 400 మందికి పైగా విధులు కేటాయించారు.

కేంద్రాలను సందర్శించిన సీఎస్, డీవోలు

బోర్డు ఉన్నతాధికారుల ఆదేశాలు, డీఐఈవో సూచన మేరకు సోమవారం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాలను సందర్శించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల నామినల్ రోల్స్ ఆధారంగా అవసరమైన బెంచీలు, తరగతి గదుల ఏర్పాట్లను సరిచూసుకున్నారు. పరీక్షల నిర్వహణలో అవసరమైన సామగ్రి అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకున్నారు. ఎక్కడైన సమస్యలుంటే ప్రైవేట్ పరీక్ష కేంద్రాలైతే ఆయా యాజమాన్యాలకు తెలియజేశారు. ప్రభుత్వ కేంద్రాలైతే డీఐఈవోకి వివరించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టారు.

కూసుమంచి కేజీబీవీలో పరీక్షల హాల్‌టికెట్ నెంబర్లు వేస్తున్న ఎస్‌వో